సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం, 2, మే, 2023



సోమశిలలో 50.872 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 50.872 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 187 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,020
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,570
3 శాతం జీఎస్టీతో	రూ.5,737
సవర (8 గ్రా)	రూ.45,880

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.5 /28.0

సోమవారం గాలిలో 91 శాతం తేమ ఉంది. మంగళ, బుధవారాల్లో ఈదురుగాలులు, పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది.

న్యూస్‌రీల్

85.67 శాతం మందికి పింఛన్ల పంపిణీ



ఇందుకూరుపేట: గంగపట్నంకు చెందిన రమణమ్మకు నగదు ఇస్తున్న వలంటీర్ మహిత

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లాలో సోమవారం మొదలైంది. 3,06,799 మంది లబ్ధిదారులకు గానూ తొలిరోజు 2,62,843 మందికి నగదు అందజేశారు. దీంతో 85.67 శాతం నమోదైంది. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తెల్లవారుజాము నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి, ఎవరైనా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుంటే అక్కడికి వెళ్లి పింఛన్లు ఇచ్చారు. ఈనెల 5వ తేదీ వరకు పెన్షన్లు పంపిణీ చేయనున్నారు.


గ్రూప్‌-2 పరీక్షలకు ఉచిత శిక్షణ

- మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

ఆత్మకూరు: మేకపాటి గౌతమ్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా ఏపీపీఎస్సీ గ్రూప్‌-2 పరీక్షలకు సంబంధించి యువతీ, యువకులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు నెల్లూరు మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మేకపాటి రాజమోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు మాజీ ఎంపీ అందజేసే లెటర్ తీసుకుని తమ విద్యార్హత వివరాలను పొన్నూరు రోడ్డులోని టార్గెట్ ఐఏఎస్ అకాడమీలో ఈనెల 25వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జూన్ ఒకటో తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 90305 62728, 94409 89629 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఊపిరి.. చాలా కష్టంగా..

మనం కాసేపు ముక్కు మూసుకుంటే ఊపిరాడక చాలా ఇబ్బంది పడతాం. మళ్లీ గాలి పీల్చుకున్న తర్వాత పోయిన ప్రాణం తిరిగొచ్చినట్లు అనిపిస్తుంది. అయితే ఆస్తమా బాధితులు ఈ ఇబ్బందులను నిత్యం ఎదుర్కొంటారు. పడని ఆహార పదార్థాలు తిన్నా.. పొగబారిన పడినా.. చలి వాతావరణం ఉన్నా వారు పడే కష్టాలు వర్ణనాతీతం. రోగులకు అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం మే 2వ తేదీన వరల్డ్ ఆస్తమా డేను నిర్వహిస్తారు.



శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు

- నేడు ప్రపంచ ఆస్తమా దినోత్సవం
- పెరుగుతున్న బాధితులు
- అవగాహనతోనే చెక్
- ఈ ఏడాది నినాదం ఆస్తమా కేర్ ఫర్ ఆల్



నెల్లూరు పెద్దాస్పత్రి పల్మనాలజీ వార్డులో చికిత్స పొందుతున్న రోగులు (ఫైల్)

నెల్లూరు(అర్బన్): వాతావరణ, జల, వాయు కాలుష్యం, ఆహారపు అలవాట్లతో ఆస్తమా రోగులు పెరుగుతున్నారు. ప్రధానంగా కరోనా మహమ్మారి తర్వాత ఈ సంఖ్య ఎక్కువైంది. ఆస్తమా ఉంటే ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉంటుంది. దగ్గు, పిల్లికూతలు, ఆయాసం వచ్చి పేషెంట్ తీవ్ర ఇబ్బందులకు గురవుతాడు. ఈ పరిస్థితిని గమనించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ 1993వ సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం మే నెల మొదటి మంగళవారాన్ని ఆస్తమా డేగా ప్రకటించి ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది ఆస్తమా కేర్ ఫర్ ఆల్ అనే నినాదాన్ని ఇచ్చింది. జిల్లాలో వైద్యశాఖాధికారులు మంగళవారం ఆస్తమా దినోత్సవం సందర్భంగా పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

వయసుతో సంబంధం లేకుండా..

ఆస్తమా అనేది శ్వాస సంబంధ రుగ్మతల్లో ఒకటి. పీల్చే గాలి ఊపిరితిత్తుల్లోకి వెళ్లడానికి, బయటికి రావడానికి ఉన్న నాళాలు వాచిపోయి సన్నబడతాయి. ఫలితంగా గాలి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుంది. నడిచినా, ఏదైనా పనిచేసినా ఆయాసం వస్తుంది. గొంతులో నుంచి ఈల వేసినట్లు (పిల్లికూతలు) శబ్దాలు వస్తాయి. వయసుతో సంబంధం లేకుండా ఈ వ్యాధి అందరికీ సోకుతుంది.

జిల్లాలో పరిస్థితి

పల్మనాలజిస్టల లెక్కల ప్రకారం జిల్లాలో 2.50 లక్షల మంది ఆస్తమా రోగులు ఉన్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుర్తించింది. 11 సంవత్సరాల్లోపు చిన్నారుల్లో 30 వేల మంది వరకు రోగులున్నారు. కోవిడ్ తర్వాత ఈ సంఖ్య మరింత వేగంగా పెరుగుతున్నట్లు పేర్కొంటున్నారు.

ప్రధాన కారణాలు

ప్రధానంగా పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యంతో పాటు వాతావరణ కాలుష్యం కారణం. కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్ లాంటి పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం, వ్యాయామం లేకపోవడం, జంక్ ఫుడ్ తినడం కూడా ఆస్తమాకు కారణాలు. దీనిని నివారించాలంటే అవగాహన పెంచుకుని చల్లటి పదార్థాలను మానేయాలి. పౌష్టికాహారంతోపాటు తగిన వ్యాయామం ఉండాలి. అప్పుడే అదుపులో ఉంచుకోవచ్చు.

ముందస్తు జాగ్రత్తలతో చెక్



గతంలో కన్నా ఇప్పుడు ఆస్తమా రోగులు ఎక్కువవుతున్నారు. కాలుష్యంతోపాటు శారీరక శ్రమ లేకపోవడం ప్రధాన కారణాలు. పిల్లలు కంప్యూటర్లకు పరిమితమై ఏసీల్లో ఉండడం, ఊబకాయం కూడా కారణాలే. ఆస్తమా వస్తే శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులుంటాయి. దగ్గు, పిల్లికూతలు, ఛాతి పట్టినట్లు ఉండడం, ఆయాసం లాంటి లక్షణాలు కనిపిస్తే సొంత వైద్యం చేసుకోకుండా పల్మనాలజిస్ట్ వద్దకు వెళ్లి పీఎఫ్‌టీ పరీక్షను చేయించుకోవాలి. తీవ్రతను బట్టి డాక్టర్ రాసే మందులతో మొదట్లోనే ఆస్తమాను నియంత్రించుకోవచ్చు. అందరిలా సంతోషంగా ఉండొచ్చు. ఫ్లూ, న్యూమోకోకల్ వ్యాక్సిన్లు వేసుకోవడం ద్వారా 70 నుంచి 80 శాతం మందికి ఆస్తమా రాకుండా చేయొచ్చు.

– డాక్టర్ పోకల రవి, పల్మనాలజిస్ట్

వచ్చే ఎన్నికల్లోనూ విజయమే లక్ష్యం

- రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి



మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): 'వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందాం.' అని రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులతో సోమవారం నెల్లూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కోసం మొదటి నుంచి కష్టపడిన వారికి అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. పార్టీ జిల్లాలో బలంగా ఉందన్నారు. అనుబంధ విభాగాల అధ్యక్షులందరూ ఆయా ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలను సంప్రదించి పార్టీ పట్ల విధేయతతో ఉండి, కష్టపడిన వారిని అనుబంధ విభాగాల్లో నియమించేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకుని వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు మొయిళ్ల గౌరీ, బీసీ సెల్ నుంచి జాజుల కోటేశ్వర్రావు, ఎస్సీ సెల్ నుంచి పందింటి కామరాజు, ఎస్టీ సెల్ నుంచి పాలకీర్తి రవి తదితరులు పాల్గొన్నారు.

పీసీలకు హెచ్‌సీలుగా పదోన్నతి

నెల్లూరు(క్రైమ్): ఐదుగురు కానిస్టేబుల్స్‌కు హెడ్‌కానిస్టేబుల్స్‌గా పదోన్నతి కల్పిస్తూ ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న ఎంవీ రమణయ్య (శ్రీహరికోట), ఎం.శ్రీనివాసులు (వెంకటగిరి), ఎల్.చిరంజీవులు (పెళ్లకూరు), బి.సుధాకర్ (తడ), నెల్లూరు జిల్లాకు చెందిన కె.కిరణ్ (డీఎస్‌బీ)లు పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు. కాగా తిరుపతి జిల్లా సిబ్బందికి సంబంధించిన సర్వీస్ రికార్డులను నెల్లూరులోని పోలీస్ కార్యాలయంలోనే నిర్వహిస్తున్నారు.

మైనింగ్ అధికారి బాధ్యతల స్వీకరణ



శ్రీనివాసకుమార్

నెల్లూరు(సెంట్రల్): జిల్లా మైనింగ్ అధికారిగా శ్రీనివాసకుమార్ సోమవారం నెల్లూరులోని అయ్యప్పగుడి వద్ద కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో ఉన్న ఏడీ మైనింగ్, డీడీ మైనింగ్ కార్యాలయాలను ప్రభుత్వం జిల్లా మైనింగ్ కార్యాలయంగా మార్చింది. ఈనెల ఒకటో తేదీ నుంచి ఈ విధానం అమల్లోకి వచ్చింది. నెల్లూరు జిల్లాలో ఉన్న ఏడీ, డీడీ అధికారులు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. కాగా విజయవాడలో ఉన్న శ్రీనివాసకుమార్‌ను ఇక్కడికి బదిలీ చేయగా ఆయన బాధ్యతలు స్వీకరించారు.

అసిస్టెంట్ కలెక్టర్ నియామకం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాకు అసిస్టెంట్ కలెక్టర్‌గా వి.సంజనా సింహ నియమితులయ్యారు. 2022 బ్యాచ్‌కు చెందిన వి.సంజనా సింహాను నెల్లూరుకు కేటాయించారు. క్షేత్రస్థాయిలో శిక్షణ పొందనున్నారు.



మేడే ర్యాలీ

మేడే సందర్భంగా వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నెల్లూరులో భారీ ర్యాలీ జరిగింది. ఇందులో ఆయా పార్టీలకు చెందిన రాష్ట్ర, జిల్లా స్థాయి ముఖ్య నాయకులు పాల్గొన్నారు. పార్టీల కార్యకర్తలు, కార్మికులు ఎర్రజెండాలు, బెలూన్లు చేత పట్టుకుని ర్యాలీలో ముందుకు కదిలారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.65
సన్నవి	: రూ.35
పండ్లు	: రూ.20

నెల్లూరు

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 126
లేయర్ (లైవ్)	: 80
బ్రాయిలర్ చికెన్	: 220
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 244
లేయర్ చికెన్	: 136

మబ్బులు కమ్మి.. వర్షం కురిసి..

నెల్లూరు నగరంలో సోమవారం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం మబ్బులు దట్టంగా కమ్ముకున్నాయి. మధ్యమధ్యలో కాసేపు ఎండ కాచింది. సాయంత్రం వర్షం కురిసింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



నెల్లూరులో ఒక్కసారిగా వాతావరణం మారి కమ్మేసిన మబ్బులు



నగరంలో కురుస్తున్న వర్షం



వర్షానికి తడవకుండా..

యువతి ఆత్మహత్య

సీతారామపురం: మరో 4 రోజుల్లో పెళ్లి చేసుకోబోతుండగా బాత్‌రూంలో ఉరేసుకొని యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మండలంలోని నారాయణమ్మపేటలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు అనారోగ్యకారణాలతో, పెళ్లి ఖర్చులు ఎక్కువై కుటుంబసభ్యులు ఇబ్బందులు పడుతున్నారన్న కారణంతో నారాయణమ్మపేటకు చెందిన టి.సిద్దేశ్వరి(24) ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిషోర్ బాబు తెలిపారు. సీఐ వి.గిరిబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

జొన్నవాడలో మూల మంత్ర హోమం

- విచ్చేసిన కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి
- ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి దంపతులు



శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి ఆశీస్సులు అందుకుంటున్న వేమిరెడ్డి దంపతులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న మహా కుంభాభిషేక వేడుకలు సోమవారం ప్రధాన ఘట్టానికి చేరుకున్నాయి. వేడుకల్లో ప్రాముఖ్యత కలిగిన మూల మంత్ర హోమంలో సోమవారం కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి పాల్గొన్నారు. తొలుత పీఠాధిపతికి ఆలయ అర్చకులు, పాలకమండలి సభ్యులు, ఉభయకర్తలు ఆలయ మర్యాదలతో మేళతాళాల నడుమ ఘన స్వాగతం పలికారు. యాగశాల వద్దకు చేరుకున్న స్వామివారు సప్తనదుల జలాలతో ఉన్న కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాటితో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా మూల మంత్ర హోమాన్ని నిర్వహించారు. అలాగే గణపతి పూజ, పుణ్యాహవాచనం, వేదిక పూజ, యాగశాల పూజలు నిర్వహించారు. వీటితోపాటు మొదటి కాల పూర్ణాహుతి, రెండో కాల పూర్ణాహుతి, లఘు పూర్ణాహుతి కార్యక్రమాలను చేపట్టారు.

ఆశీస్సులు

మహా కుంభాభిషేక వేడుకల్లో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి – ప్రశాంతిరెడ్డి దంపతులు శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి ఆశీస్సులను అందుకున్నారు. స్వామి ఆశీస్సులను అందుకోవడం చాలా సంతోషంగా ఉందని వేమిరెడ్డి దంపతులు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా వ్యవహరిస్తున్న కొలన్ రాజారెడ్డి – పూజిత దంపతులు కూడా స్వామి ఆశీస్సులను అందుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై దృష్టి సారించాలి

- కలెక్టర్ హరినారాయణన్



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): 'స్పందన' కార్యక్రమంలో అందిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత గడువులోపు పరిష్కరించేలా అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అర్జీలు అందజేశారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్‌ఓ వెంకట నారాయణమ్మ అర్జీదారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వచ్చిన పలు అర్జీలను సత్వరమే పరిష్కరించి చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ చిరంజీవి, పీడీలు రవీంద్ర, వెంకటదాసు, సౌజన్య, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీఈఓ గంగాభవాని, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మోటార్ బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

కావలిరూరల్: మండలంలోని సందెమ్మపురం వద్ద మోటార్ బైక్ అదుపుతప్పి పడిపోయి కుందుర్తి ప్రభాకర్ (47) అనే వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై ఎం.వెంకట్రావు తెలిపిన వివరాల మేరకు గుడ్లూరు మండలం సీతారామపురం గ్రామానికి చెందిన కుందుర్తి ప్రభాకర్ భార్య నిర్మల, ఇద్దరు పిల్లలతో కలిసి 15 ఏళ్ల క్రితం కావలికి వచ్చి పాతవూరులో నివాసం ఉంటున్నారు. ప్రభాకర్ రామాయపట్నం పోర్టు వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఆదివారం డ్యూటీకి వెళ్లి సోమవారం విధులు ముగించుకుని మోటార్ బైక్‌పై ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో సందెమ్మపురం గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి పడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చైతన్య మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి

- స్వగ్రామానికి తరలింపు



పోస్టుమార్టం అనంతరం చైతన్య మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న దృశ్యం

నెల్లూరు(క్రైమ్): ఢీ కొరియోగ్రాఫర్ చైతన్య మృతదేహానికి నెల్లూరు ప్రభుత్వ వైద్యులు సోమవారం పోస్టుమార్టం పూర్తి చేశారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించగా స్వగ్రామానికి తరలించారు. వివరాలు.. లింగసముద్రం మండలం ముత్తంవారిపాళెం గ్రామానికి చెందిన సి.చైతన్య(32)కు చిన్నతనం నుంచే డ్యాన్స్ అంటే ఇష్టం. అమ్మ, నాన్న, చెల్లెలితో హైదరాబాద్‌లో ఉంటూ పలు టీవీ చానళ్లలో ప్రసారమయ్యే రియాల్టీ షోల్లో కొరియోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఐదేళ్లుగా ఢీ షోలో ఓ బృందానికి కొరియోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. దీని ద్వారా వచ్చే రెమ్యునరేషన్ తన మెయింటినెన్స్, తనను నమ్ముకున్న డ్యాన్సర్లకు సరిపోయేది కాదు. దీంతో అప్పుల పాలయ్యాడు. ఈ నేపథ్యంలో ఆయన నెల్లూరు క్లబ్‌లోని ఓ గదిలో సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. ఈ ఘటనపై మృతుడి బాబాయి మాల్యాద్రి ఫిర్యాదు మేరకు దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. చైతన్య తల్లిదండ్రులు హుటాహుటిన నెల్లూరుకు చేరుకున్నారు. చైతన్య సెల్ఫీ వీడియో ప్రసార, సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఆయన అభిమానులు, స్నేహితులు, డ్యాన్సర్లు పదుల సంఖ్యలో సోమవారం నెల్లూరు జీజీహెచ్‌లోని మార్చురీ వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ప్రభుత్వ వైద్యులు మృతదేహానికి పోస్టుమార్టం పూర్తిచేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. డ్యాన్స్‌లో మెళకువలు నేర్పడంతోపాటు తమను నడిపించిన మాస్టర్ చైతన్య భౌతికకాయాన్ని చూసి పలువురు డ్యాన్సర్లు కన్నీటి పర్యంతమయ్యారు. కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదించారు. బంధువులు, డ్యాన్సర్లు, స్నేహితుల అశ్రునయనాల నడుమ చైతన్య మృతదేహాన్ని కుటుంబసభ్యులు తమ స్వగ్రామానికి తరలించారు.

నేను బతుకుతున్నదే నా బిడ్డ కోసం



నేను బతుకుతున్నదే నా బిడ్డ కోసం. ఇలా చేస్తాడని అనుకోలేదు. నన్ను మోసం చేసి వెళ్లిపోయాడు. అప్పుల కోసం చనిపోతాడని ఊహించలేదు. ఆత్మహత్య చేసుకునే 15 నిమిషాల ముందు నాతో ఫోన్‌లో మాట్లాడాడు. సన్మాన కార్యక్రమంలో డల్‌గా ఉన్నావు నవ్వుతూ ఉండమని చెబితే సరే అన్నాడు. ఆ తర్వాత ఆత్మహత్య చేసుకున్నాడు. ఫోన్ కట్ చేయక ముందు జామాయిల్ చెట్లు అమ్మాను.. రూ.4 లక్షలు వస్తున్నాయని చెప్పాను. అప్పుడు కూడా ఏమీ చెప్పలేదు. ఎందుకు అలాంటి నిర్ణయం తీసుకున్నాడో ఇప్పటికీ అర్థం కావడం లేదు. నేను వాడి వద్ద ఏది దాచేదాన్ని కాదు. డబ్బులదేముంది ఎప్పుడైనా సంపాదించుకోవచ్చని చెప్పేవాడు. ఓ సారి ఫోన్ చేసి నీవు ఇంటికి రాలేదంటే నేను చచ్చిపోతా అంటే.. నువ్వు చచ్చిపోతే నన్నెవరు చూస్తారమ్మా.. నీ పక్కన నాక్కూడా బెర్త్ కన్ఫామ్ చేయమ్మా అన్నాడు. ఇప్పుడేమో ఒక్కడే వెళ్లిపోయాడు. నేను చచ్చిపోతున్నా.. నువ్వు కూడా రా అమ్మ అంటే.. నేను కూడా వెళ్లేదాన్ని కదా.

– చైతన్య తల్లి లక్ష్మీరాజ్యం

పదేళ్ల ప్రయాణం



మా ఇద్దరిది పదేళ్ల ప్రయాణం. చైతన్య చాలా సెన్సిటివ్ మనస్తత్వం. తన పక్కనుండే వారూ బాగుండాలని కోరుకుంటాడు. ఎవరికి ఇబ్బంది వచ్చినా అండగా ఉండేవాడు. రెండు రోజుల క్రితం తనతో మాట్లాడాను. ఎప్పుడూ అప్పులున్నాయని చెప్పలేదు.

– చిట్టి, డ్యాన్స్‌మాస్టర్

చైతన్య లేడని ఊహించలేను



పోలీసుతో మాట్లాడుతున్న డ్యాన్స్‌మాస్టర్ పండు

ఇద్దరం పక్కపక్క సీట్లలోనే ఉండేవాళ్లం. ఎంతో సన్నిహితంగా ఉండేవాడు. అప్పులు న్నాయని ఎప్పుడూ చెప్పలేదు. ఆత్మహత్య చేసుకుంటాడని ఊహించలేదు. మాటలు రావడం లేదు.

– పండు, డ్యాన్స్‌మాస్టర్

వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

బుచ్చిరెడ్డిపాళెం: అభం శుభం తెలియని బాలికపై అదే ప్రాంతానికి చెందిన 60 ఏళ్ల వృద్ధుడు పోట్లూరు చెంచురామయ్య లైంగికదాడి చేసిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు మండలంలోని ఇస్కపాళెం పంచాయతీలో 11 ఏళ్ల బాలిక ఆదివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో ఇంటికి సమీపంలో ఒంటరిగా ఆడుకుంటోంది. దీనిని గమనించిన పోట్లూరు చెంచురామయ్య బాలికను సమీపంలోని ఖాళీ స్థలంలోకి తీసుకెళ్లి కొట్టి లైంగికదాడి చేశాడు. అనంతరం అక్కడి నుంచి చెంచురామయ్య పరారయ్యాడు. ఏడుస్తూ ఇంటికి వచ్చిన బాలికను తల్లి ఏం జరిగిందని ఆరా తీసింది. అదే సమయంలో కూలి పనుల నిమిత్తం వెళ్లిన బాలిక తండ్రి కూడా ఇంటికి రావడంతో బాలిక జరిగిన ఘటనను వివరించింది. దీంతో బాలికను వెంటనే బుచ్చిరెడ్డిపాళెంలోని సీహెచ్‌సీకి తరలించి వైద్యం అందించారు. అనంతరం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు నిందితుడిపై పోక్సో చట్టం ద్వారా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీర ప్రతాప్ సోమవారం తెలిపారు. ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితుడు చెంచురామయ్యపై గతంలో కూడా పలు కేసులు ఉన్నాయని ఎస్సై తెలిపారు.

పరారైన నిందితుడిని పట్టుకున్న పోలీసులు

- ఫిబ్రవరి 1న పోలీసుల కళ్లుగప్పి పరారీ
- నిఘా ఉంచి అరెస్ట్ చేసిన పోలీసులు

సంగం: నెల్లూరు సీసీఎస్ పోలీసులు ఓ కేసులో విచారణ నిమిత్తం ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీన నిందితుడు అచ్చి గిరిని కారులో తీసుకువెళ్తుండగా సంగం బీరాపేరు వాగు వద్ద పరారు కాగా సోమవారం అతన్ని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు నెల్లూరు రూరల్ మండలం ఉప్పుటూరుకు చెందిన అచ్చి గిరి చోరీ కేసులో ప్రధాన నిందితుడు. ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీన ఓ చోరీ కేసులో అదుపులోకి తీసుకున్న నెల్లూరు పోలీసులు విచారణ నిమిత్తం కారులో ఏఎస్‌పేటకు తీసుకెళ్లి తిరిగి నెల్లూరుకు వెళ్తున్నారు. సంగం బీరాపేరు వద్దకు రాగానే గిరి బహిర్భూమికి వెళ్లాలని దిగి పక్కనే ఉన్న బీరాపేరు వాగులో దూకి పరారయ్యాడు. దీంతో నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ గిరిబాబు ఫిర్యాదుతో సంగం ఎస్సై నాగార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన విషయం విధితమే. అప్పట్లో పరారైన నిందితుడు అచ్చి గిరిపై సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవి నాయక్, ఎస్సై నాగార్జునరెడ్డి తమ సిబ్బందితో నిఘా వేశారు. ఫిబ్రవరి 1న పరారైన గిరి ఆ రాత్రి కాలువను ఈదుకుంటూ వెళ్లి పెన్నానది మధ్యలో ఇసుక మేట్లపై నిద్రించాడు. తర్వాత రోజు సూరాయపాళెం వెళ్లి అక్కడి నుంచి ఉప్పుటూరుకు చేరుకుని కుటుంబసభ్యులతో కలిసి విజయవాడకు వెళ్లి అక్కడ చేపలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఏప్రిల్ 30వ తేదీ ఉప్పుటూరు ప్రాంతానికి వచ్చిన నిందితుడు గిరి సోమవారం ఉదయం పొదలకూరు మండలం సమీపంలోని మరుపూరు బస్‌షెల్టర్ వద్ద ఉండగా సమాచారం అందుకున్న సీఐ, ఎస్సై సిబ్బందితో వెళ్లి పట్టుకుని కోర్టుకు హాజరుపరిచారు. నిందితుడు గిరి దాదాపుగా 10కి పైగా చోరీ కేసుల్లో ప్రధాన నిందితుడని ఎస్సై తెలిపారు.